## పారిశుధ్య పనులను పరిశీలించిన డివిజనల్ అభివృద్ధి అధికారిణి నాగలక్ష్మి



(ఎస్ రాయవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త)

మండలంలోని పలు గ్రామాల్లో అమలు జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం డివిజనల్ అభివృద్ధి అధికారిణి ఇ. నాగ లక్ష్మీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతీ పంచాయతీలో తడి మరియు పొడి చెత్తలను వేరు చేసి తడి చెత్తను సంపద తయారీ కేంద్రం వద్ద కు తరలించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని తద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచు పెంచుకోవచ్చని సూచించారు. తిమ్మాపురంలో గ్రామపంచాయతీ పరిధిలో గల సంపద తయారీ కేంద్రాన్ని ఆమె స్వయంగా పరిశీలించి మెరుగైన నిర్వహణ కోసం పలు సూచనలు చేశారు. అలాగే ఇంటి పన్నులు వసూలు పై ఈ నెల 15 నాటికి శత శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని.లక్ష్యాలను పూర్తి చేయని పంచాయతీ కార్యదర్శిలు బాధ్యత వహించాలని.ఇంటి పన్నులు వసూలు పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆమె పంచాయతీ కార్యదర్శిలను ఆదేశించారు.మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి మొండి బకాయిలు ఉన్న ఇళ్లకు విద్యుత్ సరఫరా మరియు నీటిసరఫరా నిలిపివేయుటకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. లైసెన్స్ ఫీజులు.సెల్ టవర్స్ నుండి నాన్ టాక్స్ వసూలు చేయాలన్నారు. ధర్మవరం. పెను గోళ్ళు.తిమ్మాపురం. పెద గుమ్ము లూరు గ్రామ పంచాయతీలలో జరిగిన ఇంటి పన్నుల వసూలు ప్రక్రియలో ఆమె స్వయంగా పాల్గొని గృహ యజమానులకు తక్షణమే పన్నులు చెల్లించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ.పంచాయతీ కార్యదర్శిలు ప్రసాద్.నాగ ప్రభ.రాజు. శ్రీను.గ్రామ పెద్దలు నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్క్రాబ్ సేకరిస్తున్న స్వచ్ఛ రథం



గొలుగొండ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

గ్రామాల్లో ప్రజలు నిల్వ చేస్తున్న వ్యర్థాలను స్క్రాబ్ ను నేరుగా పంచాయతీ ద్వారా సేకరించి తగిన నిత్యవసర సభ్యులు అందించే లక్ష్యంగా అందులో అందుబాటులోకి తీసుకొచ్చిన స్వచ్ఛ రథం గ్రామాల్లో పర్యటిస్తుంది. గొలుగొండలో శుక్రవారం గ్రామంలో పర్యటిస్తూ ప్రజలు వేరు చేసి ఉంచిన పనికిరాని ప్లాస్టిక్ సామాన్లు, ఇనుప ముక్కలు, పుస్తకాలు, న్యూస్ పేపర్, ప్లాస్టిక్ బాటిల్, గాజు వస్తువులను తీసుకొని తగిన నిత్యవసర వస్తువులను ఉచితంగా అందజేస్తున్నారు. అల్యూమినియం ఇంకా ఇతర సామాగ్రిలు పైన సామాన్లు మీరు ఇచ్చే వస్తువులు బట్టి రథంలో ఉన్న సరుకులను అందజేస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీలో నెలలో ఒకరోజు స్వచ్ఛ రథం గ్రామాల్లో పర్యటిస్తుందని వ్యర్థాలను దాచి ఉంచి స్వచ్ఛ రథం వద్దకు తీసుకురావాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కావున మీరందరూ గమనించాలన్నారు.

## గోకులపాడు గ్రామంలో లేగ దూడల ప్రదర్శన



ఎస్ రాయవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

ఎస్ రాయవరం మండలం గోకులపాడు గ్రామం లో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో 45 లేగ దూడల పాల్గొనగా దానిలో మొదటి బహుమతి బాదంపల్లి ఈశ్వరరావు, రెండోవ బహుమతి కొఠారి గంగతల్లి, మూడవ బహుమతి నానెపల్లి ఆదినారాయణలు ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమానికి డి.ఎల్.డి.ఏ ఈ.ఓ డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు.నక్కపల్లి పశుసంవర్ధక శాఖ ఉపసంచలకులు డాక్టర్ వీర్రాజు చినగుమ్ములూరు వంశీకృష్ణయేదవ మరియు ఇతర డాక్టర్లు , పారస్టాఫ్ ,గ్రామ నాయకులు ,పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు

## ఆలయాల వద్ద పటిష్టమైన భద్రత చర్యలపై విస్తృత ప్రచారం..

### కమిటీలు సహకరించాలి: సిఐ మురళి

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

జిల్లా పరిధిలో ఉన్న ఆలయాల్లో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రాత్రి నక్కపల్లి దత్తత గ్రామ పోలీస్ సిబ్బంది మండలం లోని కాగిత ,వెదుళ్ళ పాలెం, సారి పల్లి వాని పాలెం ,చందనాడ, జానకయ్యపేట ,సిహెచ్ఎల్ పురం ,చిన్న దొడ్డి గళ్ళు గ్రామాల్లో ఉన్న పలు ఆలయాలను సందర్శించారు. ఆలయాలను పరిశీలించి కమిటీ సభ్యులతో సమావేశమై, తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో సరైన లైటింగ్ సౌకర్యం కల్పించాలని, భద్రతా పరంగా నైట్ వాచ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులతో పాటు ఆలయ నిర్వహకులకు సూచించారు. ఆలయానికి చెందిన విలువైన ఆభరణాలను భద్రంగా సంరక్షించాలని, హుండీ డబ్బును సమయానుకూలంగా సేకరించి భద్రపరచాలని కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఆలయ చోరీలను నివారించడానికి ఈ చర్యలు తీసుకోవడం అవసరమని సీఐ మురళి వారికి తెలియజేశారు. సీఐ మురళి గ్రామాల్లో ఆలయాల భద్రత విషయంలో కమిటీ సభ్యులతో మాట్లాడి ముందస్తుగా ఇటువంటి చర్యలు తీసుకున్నట్లు గ్రామస్తులతో మాట్లాడటం సంతోషంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సై లు సన్ని బాబు, సాహిబా అంజుమ్, పిసిలు రమణ, రాము, హోమ్ గార్డ్ రాజు, తదితరులు ఉన్నారు.

## ప్రారంభమైన మహా శివరాత్రి ఉత్సవాలు

చోడవరం,ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:



స్థానిక స్వయంభు గౌరీశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి కళ్యాణ మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు లోకకళ్యాణార్థం ఉత్సవ కమిటీ విగ్నేశ్వర పూజ పుణ్యాహవాచనం సంప్రోక్షణ పూజలు ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సురేష్ దంపతులు నిర్వహించారు. అలాగే మహాన్యాస పూర్వక పంచామృత అభిషేక పూజలను రుద్రహోమ పూజలు జరిగాయి. గౌరీశ్వర స్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే సాయంత్రం జంగమ సేవా సంఘం ఆధ్వర్యంలో తిరువీధి ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది.అలాగే సాయంత్రం మహిళలలు చే గౌరీ పార్వతీ దేవికి లక్ష కుంకుమార్చన పూజలు ప్రత్యేక దీపారాధనలు కూడా చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి, శ్రీనివాస్, మహేష్ తదితరులు అంకురార్పణ ద్వజారోహణ పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో వేదమంత్రోత్సవాల నడుమ నిర్వహించారు. దీంతో కళ్యాణ మహాశివరాత్రి ఉత్సవాలుకి తెర తీశారు. ఈనెల 18 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా నెల 15 న మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ప్రమాదాల నివారణపై డీఎస్పీ శ్రీనివాస్ సమీక్ష



నక్కపల్లి, ప్రభాతవార్త

నక్కపల్లి సర్కిల్ పరిధిలో ప్రమాదాల నివారణ విషయంలో సిబ్బంది ఏవిధంగా వ్యవహరించాలి ఏటువంటి చర్యలు చేపట్టాలి అనే విషయాలపై గురువారం నర్సీపట్నం సబ్‌డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్ నక్కపల్లి సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సందర్భంలో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాస్, సి.ఐ. మురళితో కలిసి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, ఎన్‌హెచ్ఏఐ సిబ్బందితో మాట్లాడారు. బ్లాక్ స్పాట్స్, ప్రమాద ప్రదేశాలను పరిశీలించారు. రోడ్డు భద్రత చర్యలలో భాగంగా తగినంత లైటింగ్, సోలార్ బ్లింకర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ పై ఉన్న పాడైన స్లాబ్‌లను మరమ్మతు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ప్రమాదాలు నివారించేందుకు రంబుల్ స్ట్రిప్స్, మిర్రర్లు , సాండ్ డ్రమ్ములు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను వారితో కలిసి గుర్తించారు.


## నేడే వ్యవసాయ పరికరాలకు ధరకాస్తులు ఇవ్వండి

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

ఐ. టి. డి ఏ ద్వారా 90 శాతం సబ్సిటీ ద్వారా వ్యవసాయ పరికరాలకోసం ధరకాస్తుకు ఒక్క రోజు గడువు ఉందని ఏ. ఓ చక్రధర్ తెలియజేస్తున్నారు. వాటిలో స్ప్రెయర్లు ఇంజన్లు తార్పాలిన్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు కు దరఖాస్తులను సచివాలయ వ్యవసాయ సహాయకులకు అందించాలని ఏ. ఓ చక్రధర్ తెలిపారు.

## పాఠశాలను సందర్శించిన దేవదాసు

అరకు రూరల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



అరకులోయ మండలంలోని యండపల్లి వలస ఏపిఆర్ (బాలికల) పాఠశాలను శుక్రవారం జిల్లా యస్సి, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వంతల దేవదాసు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అంది స్తున్న విద్యా సదుపాయాలు, వసతి, భోజన వ్యవస్థ, పరిశుభ్రత, భద్రతా చర్యలను పరిశీలించారు. దేవదాసు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో మాట్లాడటం, తమ విద్యాపై చూపుతున్న ఆసక్తి ప్రశంసనీయమన్నారు. ఉపాధ్యాయులతో, పాఠశాల సిబ్బందితో సమావేశమై బోధన ప్రమాణాలు, హాజరు శాతం, ఫలితాలు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో ఉన్న క్రమశిక్షణ, విద్యా వాతావరణం సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాల మరింత అభివృద్ధి చెందేం దుకు అవసరమైన సూచనలు ఇచ్చి, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని పాఠశాల యాజమాన్యాన్ని కోరారు. జనసేన అరకు ఇంచార్జ్ చెట్టి చిరంజీవి, పాఠశాల ప్రిన్సిపాల్ నాగరత్నం, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్, ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు



నర్సీపట్నం,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త

నర్సీపట్నంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ మాట్లాడుతూ నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలా మంది ప్రజలు రక్తం దొరకక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, ప్రమాదాలకు గురయ్యే వారు రక్తం కోసం అనేక అవస్థలకు గురి కావాల్సి వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో తాము స్వచ్ఛందంగా నర్సీపట్నంలో ఉన్న అమ్మ బ్లడ్ సెంటర్లో రక్తదానం చేయడం జరిగిందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థుల కోసం పోరాటలే కాకుండా సమాజం కోసం ఇటువంటి పనులు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాని, కృష్ణ, సన్యాసిరావు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

నర్సీపట్నం,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త



నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద జరిగే మహాశివరాత్రి మహోత్సవాల ఏర్పాట్లను ఆర్డీవో వివి.రమణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తరవాహిని, బ్రహ్మలింగేశ్వర స్వామి వద్ద మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా, భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, ఎస్సై ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాకు 180 మంది ఎంపిక



నర్సీపట్నం,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త

నర్సీపట్నం ఎంఎల్ఎస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు సంబంధించి 20 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 320 మంది యువతీ, యువకులు హాజరవ్వగా, వీరిలో ఉద్యోగాలకు 180 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో కొంత మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. కళాశాల ఛైర్మన్ మీసాల సుబ్బన్న, నేషనల్ కేరీర్ సర్వీస్ మినిస్ట్రీ ఆఫ్ లేబర్, ఎంప్లాయిమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రితీష్, కళాశాల కరస్పాండెంట్ మీసాల లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ పంపన తాతబ్బాయి, శివాజీ, కళాశాల బృందం పాల్గొన్నారు.

## నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడుతున్న సిపిఎం నేత అప్పలరాజుకు అండగా ఉంటాం

ఎస్ రాయవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



బల్క్ డ్రగ్స్ పార్క్‌కు వ్యతిరేకంగా, నిర్వాసితుల సమస్యల పరిష్కారంకోసం అహర్నిశలు పోరాడుతున్న రైతు నాయకుడు, సిపిఎం నేత అప్పలరాజు అండగా ఉంటామని సిపిఎం నక్కపల్లి మండల కార్యదర్శి మన బాల రాజేష్‌ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మవరం అగ్రహారం అప్పలరాజు నివాసంలో కలిసి సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం అక్రమంగా పీడీ యాక్ట్ నమోదు చేసి 45 రోజులపాటు విశాఖపట్నం కేంద్ర కారాగారంలో నిర్బంధించడం తీవ్రంగా ఖండించదగిన చర్య ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి, రైతుల గళాన్ని మూయించడానికి ఈ కేసు పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అయితే ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రజలందరూ, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి ఈ అక్రమ నిర్బంధాన్ని వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానంలోని అడ్వైజరీ బోర్డు పరిశీలనలో, పీడీ యాక్ట్ నమోదు చేయడానికి అప్పలరాజు గారు అర్హుడు కాదని తేల్చి, ఆయనను నిర్దోషిగా విడుదల చేయడం జరిగింది. ఇది ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు కాగా, ప్రజాస్వామ్య శక్తుల విజయం. ఈ విజయోత్సవం సందర్భంగా సిపిఎం నక్కపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో అప్పలరాజు గారిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. నాయకులు మైలపల్లి మహేష్ బాబు, చేపల సోమేష్, కొర్ర ప్రసాద్, బొంది కాశి పాల్గొన్నారు.



## రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ దత్తుడు సీతబాబు రాజుకు శుభాకాంక్షలు

ఎస్.రాయవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికైన దత్తుడు సీతబాబు రాజును శుక్రవారం తమ నివాసంలో కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా సభ్యులు చేపల రాజు, కొల్లి గోపాలకృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

## సచ్చిదానంద స్వామీజీ మరువలేము : సియ్యాధుల అచ్యుత కుమార్

ఎస్.రాయవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శుక్రవారం ఆయన పార్థివ దేహాన్ని వదలడం మరువలేమని సియ్యాధుల అచ్యుత్ కుమార్ అన్నారు స్వామీజీ తో తనకున్న అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు.తాండవ తపోవన ఆశ్రమంలో నెలకొల్పిన తర్వాత ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక విశేష గుర్తింపు లభించిందని అన్నారు. స్వామీజీ సందర్శించినప్పుడు ఎంతో ఆప్యాయతతో నన్ను ఆశీర్వదించి వారని ప్రత్యక పర్వదినాల్లో జరిగే ఆధ్యాత్మి కార్యక్రమాల్లో పాల్గొనేవాడినని. ఆధ్యాత్మిక ధర్మ ప్రచార కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనేవారిని అయన అన్నారు.

## పంచాయతీలో రోడ్లు, పెన్షన్ల కొరకు జనసేన నేత స్పందనలో ఫిర్యాదు



గూడెం కొత్తవీధి,ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

మండలంలోని సంకాడ పంచాయతీ వసువాడ నుంచి మేట్ట వీధి మీదగా బచ్చలకొండి వరకు, సంకాడ కొత్తూరు నుండి గోవాడ వరకు రోడ్ల మంజూరు చేయాలంటూ శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించిన జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు. ఆయన సంకాడ పంచాయతీలో పారాసైటిక్ వ్యాధితో బాధపడుతున్నవారు. మానసిక ఒత్తిడికి గురైన వ్యక్తులకు మెడికల్ ధ్రువపత్రాలు ఇచ్చి పెన్షన్ అందించమని కలెక్టర్‌ని కోరమని తెలిపారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించిన అసిస్టెంట్ కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.


## 17 న విజయవాడలో జరిగే రణభేరి 2.0ను జయప్రదం చేయండి

వి.ఆర్.పురం,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త



ఈ నెల 17న విజయవాడ లో జరిగే రణభేరి 2.0ను జయప్రదం చేయాలని, యుటిఎఫ్ పోలవరం జిల్లా సహాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం రేఖపల్లి లో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన ఆ సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి నాగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పి.ఆర్.సి సాధనకై జరుగనున్న రణభేరి 2.0కు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలాలన్నారు. 2023 జూలై 1 నుండి అమలు కావలసిన పి.ఆర్.సి కమిషన్‌ను ఇంత వరకు నియమించలేదని గుర్తు చేశారు. 29 % ఐ.ఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. ఉద్యోగుల, పెన్షన్ల బకాయిల చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2004 కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. హెల్త్ కార్డుల, మెడికల్ బిల్లుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్.జగదీశ్, ఎన్.రామకృష్ణ, ఎం.బాబు, శారద, అమృత, శిరీష, కుసుమ కుమారి, అర్జున్, టి.ప్రసాద్, కె.రమేష్, బి.పవన్, వెంకన్నబాబు, వెంకటరాజు, వెంకటేష్ బాబు, వెంకటరాజు, సూరిబాబు, మణికంఠ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుంటే సీజ్..



గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త

గూడెం కొత్తవీధి మండలంలోని, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్.ఐ సురేష్ వాహన దారులకు తెలియజేశారు. ఏ వాహనానికైనా నెంబర్ ప్లేట్ తప్పనిసరనీ వివరించారు. అలాగే ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వాహనాల కు తప్పనిసరిగా అన్ని వాహన పత్రాలు ఉండాలని లేని పక్షంలో వాహనాలకు చలనాలు విధించబడతాయని అన్నారు. రాష్ డ్రైవింగ్ చేసిన, హెల్మెట్ లేని ప్రయాణాలు చేసిన కఠిన చర్యలు తప్పవని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు.

## నక్కపల్లి సర్కిల్ పోలీస్ ఎదుట పశువుల వ్యాపార కూలీలు నిరసన

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)



నక్కపల్లి సర్కిల్ పోలీస్ స్టేషన్ ఎదుట పశువుల వ్యాపార కూలీలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మా వ్యాపారానికి సంబంధించి కూలీలుగా ఉన్న మాకు జామి రాజశేఖర్ మా బ్రతుకులను నాశనం చేశాడంటూ తక్షణమే,రాజశేఖర్ అనుచరులపై చర్యతీసుకోవాలని



కోరుతూ నక్కపల్లి మండలం, దేవవరం గ్రామ గోవు వ్యాపార కూలీలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేసిన కూలీలు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ మాకు న్యాయం చేయాలంటూ డి ఎస్ పి పోతిరెడ్డి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. మమ్మల్ని పశువుల వ్యాపారంలో వాడుకుని నడిరోడ్డుపై ఆయన వదిలేసిన అన్యాయం చేశారని కన్నీరు పెట్టుకున్నారు. మా ఆధార్ కార్డులు తీసుకుని యానిమల్ లవర్స్ నుండి పశువుల సరఫరాకు రాజశేఖర్ అనుమతి తీసుకున్నారని పోలీసులు ఎదుట తెలిపారు. అక్రమంగాపశువుల వ్యాపారం చేస్తున్నాడని పోలీసులు ఎదుట తెలిపారు.మేము చేసే పశువుల వ్యాపారంలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నారనిమా దగ్గరనుండి డబ్బులు తీసుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు. జామి రాజశేఖర్ కాదని వ్యాపారం చేస్తే వాహనాలను పోలీసులకు పట్టిస్తున్నాడని, పశువుల వ్యాపార కూలీలు డీఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు . రాజశేఖర్ తప్పుడుగా వ్యవహరించడమే కాకుండా మమ్మల్ని అన్యాయం చేసి తను తప్పించుకునేందుకు మంత్రి ప్రైవేట్ పిఎ గణేష్ పై ఆరోపణలు చేశారని, ఇది సరైన పద్ధతి కాదని ,అదే కాకుండా మాకు చేస్తున్న అన్యాయంపై గ్రామ పెద్దలు మాట్లాడితే వారిపై కూడా తప్పుడు ఆరోపణ చేశారని, ఇటువంటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ,ఈ వ్యాపారం విషయంలో పక్కదారి పట్టించేందుకు నాయకులను వాడుకున్నారని, ఈ వ్యాపార విషయంలో గణేష్ గాని, శ్రీకాంత్ కి ఏటువంటి సంబంధం లేదని డీఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తూ తెలిపారు. ఈ సంఘటనపై దేవవరం గ్రామ పెద్దలు మాజీ ఎంపీటీసీ దండు బలరామరాజుతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు స్పందించిన సి.ఐ. మురళి డిఎస్పి శ్రీనివాస ఆధ్వర్యంలో దేవవరం పశువుల వ్యాపార కూలీలను జామి రాజశేఖర్, తన అనుచరులు మోసం చేసినట్లు ఫిర్యాదు అందిందని స్థానిక విలేకరులకు తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపి జామి రాజశేఖర్, అతని అనుచరులపై చర్యలు తీసుకుంటామని మురళి తెలిపారు.

## శివాలయాలు వద్ద సౌకర్యాలను కల్పించండి.. ఎంపిడిఓ

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



ఈ నెల 15 తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో అన్ని శివాలయాలు వద్ద భక్తులకు పంచాయితీ ఆధ్వర్యంలో త్రాగునీరు, శానిటేషన్ సమస్యలు రాకుండా చూడాలని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో ఎంపిడిఓ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలో రాజవొమ్మంగి, జడ్డంగి, వాతంగి, ఓగిపాలెం, కరుదేవపాలెం, వంచంగి, గోబ్బిలమడుగు, లబ్బర్తి, కింద్ర కాలనీ, కిర్రాబు, అమ్మిరేకుల గ్రామాల్లో ఉన్న శివాలయాలు వద్ద భక్తులకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇంటిపన్నులు వసూలు లక్ష్యం పూర్తి చేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్స్ పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. మనమిత్ర యాప్స్, పి.4 సర్వే, అన్ని సర్వేలను పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వర రావు, కార్యదర్శులు నాగేశ్వరరావు, వరప్రసాద్, శివ, శ్యామ్ కుమార్, మురళి, సుధారాణి, బాలురెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అడ్డతీగల బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా డిఎంహెచ్వో డాక్టర్ సరిత తనిఖీ



అడ్డతీగల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం పోలవరం జిల్లా డిఎండహెచ్వో డాక్టర్ సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థినులు వాంతులు, విరోచనాలతో బాధపడు తున్నట్లు తమ దృష్టికి రావడంతో, పరిస్థితిని సమీక్షించేందుకు ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించారు.పాఠశాలలోని తరగతి గదులను, వసతి సౌకర్యాలను పరిశీలించిన ఆమె, విద్యార్థినులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. వారి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకుంటూ, ఎటువంటి ఇబ్బంది ఉన్నా ధైర్యంగా అధికారులకు తెలపాలని ఆమె సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థినులను డాక్టర్ సరిత పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్న వైద్యులతో మాట్లాడి, అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారు త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఆమె విద్యాశాఖ అధికారులు, వసతి గృహ నిర్వాహకులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని, ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులకు, ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం, తాగునీటి విషయంలో పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.

## రాజవొమ్మంగి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13, ప్రభాత వార్త



మహా శివరాత్రి పర్వదినశీ సందర్భంగా మన రాజవొమ్మంగి శ్రీ శ్రీభూ సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కొలువై వున్న శ్రీ రామ లింగేశ్వర స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున 4గం. శ్రీ రామలింగే శ్వర స్వామి వారికి ప్రాతఃకాల భస్మాభిషేకం జరుగు తుందని ఆలయ కమిటీ తెలిపారు. తదుపరి సామూహిక అభిషేక కార్యక్రమాలు, 7గం. పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. అన్నాభిషేకం, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు ప్రదోషకాలశీలో గంగా జలం, సుగంధ ద్రవ్యములతో జలాభిషేకం జరుగుతుందన్నారు. రాత్రి 8గం. నుండి లింగోద్భవ కాలం ఒంటి గంట వరకూ ఏకాదశ వార 11 రుద్రాభిషేకములు ఘనంగా జరిపించబడునని, స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు అందరూ వారి వెంట తెచ్చుకున్న పూజా ద్రవ్యాలుతో వచ్చి పూజలను చేసుకోవచ్చునని కమిటీ వారు తెలిపారు. రాత్రి 8 గంటలు నుండి ఒంటిగంట వరకూ రుద్రాభిషేకములు, భజన కార్యక్రమాలు జరుగునని ఆలయ కమిటీ వెల్లడించారు.

## మహిళలకు స్వయం ఉపాధికి శిక్షణ



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

చెరుకుంపాలెం గ్రామ యేసుక్రీస్తు మహిమ మందిర ప్రాంగణంలో ప్రధానకార్యదర్శి కె. నవీన్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం మహిళలు ఇంటి వద్దే ఖాళీ సమయాల్లో నీలిమందు, పెనాయిల్, వ్యాజలిన్, జండూబామ్, సర్ఫ్ తయారు చేసి వాటిని మార్కెటింగ్ ద్వారా జీవనోపాధి పొందడంపై రెండు రోజులు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈకార్యక్రమంలో సేవాభారత్ జిల్లా కోఆర్డినేటర్ జి. వి. రావు శిక్షణను ఇచ్చారు. ఐదు గ్రామాలు నుండి 50 మంది మహిళలు శిక్షణ కు వచ్చారు. ఈకార్యక్రమంలో చెరుకుంపాలెం ఎంపిటిసి మీనవల్లి సుబ్బారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టు మాణిక్యం, ప్రధాన కార్యదర్శి కె. నవీన్ కుమార్, వయోజన విద్య టీచర్స్ ఏ. గిరిబాబు, ఇమ్మానియేలు, సి. హెచ్. జోషఫ్, డి. దాసుబాబు, చెరుకుంపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అసౌకర్యంగా ఎంపీపీ పాఠశాల.. అధికారుల నిర్లక్ష్యం చిన్నారులకు శాపం

చింతూరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



మన్యం ప్రాంతాల్లో ఆదివాసి చిన్నారులకు విద్యా విధానం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతుంది అనటానికి ఈ ఘటన ప్రత్యక్ష ఉదాహరణ. చింతూరు మండలం తుమ్మల గ్రామపంచాయతీ పరిధిలోని లచ్చిగూడెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 25 మంది గిరిజనుల చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. సింగిల్ టీచర్ తో నడవబడుతున్న ఈ పాఠశాలలో రెండు భవనాలు ఉన్నాయి. ఒక భవనం మరమ్మత్తులు చేయక పశువులకు నిలయంగా మారింది. మరో భవనం పాఠశాల తరగతులు నిర్వహించటానికి ఉపయోగపడుతుండగా ఆ భవనానికి ముందు భాగం మొత్తం ధ్వంసం అయిపోవడంతో చిన్నారుల కాళ్లకు రోజూ గాయాలు అవుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఏదో లక్షలు వెచ్చించి మరమ్మత్తు చేయాల్సిన అవసరం లేకుండా కనీస బాధ్యతగా అధికారులు ఆ పాఠశాలకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. పాఠశాల లోని మరుగుదొడ్లు ఎందుకు పనికిరాకుండా పోయాయి. అక్కడ పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో ఒక్కసారి ఉన్నతాధికారులు ఆలోచించాలి. ఈ గ్రామం ఎక్కడో చింతూరు మండల కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో లేదు. చింతూరు ఐటీడీఏ నుంచి కేవలం 14 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామానికి వెళ్లడానికి వేసిన రోడ్డు అటవీ శాఖ అభ్యంతరాలతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. మెటల్ రోడ్డు మొత్తం లేచిపోయి ఉండటంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 8 సంవత్సరాలుగా ఇదే తంతు కొనసాగుతుంది. ఈ విషయం అధికారులకు తెలిసిన పెద్దగా పట్టించుకోకపోవడంతో అక్కడి చిన్నారులు పడుతున్న ఇబ్బందులు కనీసం పత్రికల్లో కథనాన్ని చూసిన ఉన్నతాధికారులు స్పందించి ఆ పాఠశాలకు మరమ్మత్తులు చేయించి అక్కడ గిరిజన చిన్నారులకు అసౌకర్యం లేకుండా విద్యాబుద్ధులు నేర్చుకునేలా చర్యలు చేపట్టాలి. అక్కడ పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలికి ఇబ్బంది లేకుండా పాఠశాలలో కనీస మరుగుదొడ్డ మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు స్పందించాలని కోరుకుంటూ ఈ కథనం.

